ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
గురువారం 5 జూన్ 2025


మిద్దె పంట..
ఆరోగ్యమే
ఇంట
7

శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి

● కలెక్టర్ శ్రీధర్



కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బక్రీద్ పడుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. త్వరలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్పీ ఆశోక్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయిన కడప జిల్లాలో బక్రీద్ పండుగ ఎలాంటి అటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణలో జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జంతువధ శాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పక పాటించాలన్నారు. అన్ని మతాల ప్రజలు సహనం, సంయమనంతో సంతోషంగా సంప్రదాయాలను గౌరవించుకుంటూ ముందుకు సాగాలన్నారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. పండుగ రోజున స్లాటర్ హౌస్‌ల వద్ద శానిటేషన్, మంచినీటి సరఫరాతో పాటు నింతర విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్, రెవిన్యూ యంత్రాంగం తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ రోజున ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

● కలెక్టర్ శ్రీధర్

కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో పారిశ్రామిక ఎగుమతులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలన్నారు. అలాగే జిల్లాలో జరిగే వాటర్ గ్రిడ్ పనులను నాణ్యతగా, వేగవంతంగా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉపాధ్యాయ బదిలీలను మాన్యువల్‌గా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరుటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలను మ్యానువల్ కౌన్సిలింగ్ విధానంలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికకు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. బదిలీలకు సంబంధించి ప్రొవిజినల్, సీనియార్టీ లిస్టును సకాలంలో వెబ్‌సైట్‌లో పెట్టకుండా, ఉపాధ్యాయుల అభ్యంతరాలను, సాంకేతిక సమస్యలను పరిష్కరించకుండా హడావుడిగా వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడం వలన గందరగోలం నెలకొందన్నారు. స్కూల్ అసిస్టెంట్లు బదిలీలకు మరో రెండు రోజులపాటు గడువు పెంచాలని కోరారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ అసంబద్ధ విధానాల వలన వేలాది మంది సబ్జెక్టు టీచర్లను మిగులు చూపించారని విమర్శించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరెడ్డి, సుబ్బయ్య, రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గురివిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మనమిత్రలో రేషన్‌కార్డు సేవలు

● జిల్లాలో ఇప్పటివరకు 40 వేల దరఖాస్తులు
● అర్హులకు నిరంతరం అవకాశం



ఇక రేషన్‌కార్డు సేవలకు ప్రజలు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లో కూర్చొనే అన్ని రకాల సేవలను పొందే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదిన్నర కాలం పాటు రైస్‌కార్డుల జారీకి బాలారిష్టాలు తప్పలేదు. ఎన్నికల నోటిఫికేషన్ సాకుతో ఆ ప్రక్రియ దరఖాస్తులతోనే ఆగింది. దీంతో అర్హులైన పేదలకు నిరాశ తప్పలేదు. చంద్రబాబు సర్కారు అధికారంలోకి రావడంతో గత నెల 7వ తేది నుంచి కొత్త రైస్‌కార్డుల జారీకి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రైస్‌కార్డుకు సంబంధించి 8 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. కొత్త రేషన్‌కార్డు, చేర్పులు, మార్పులు క్షణాల్లో ఎక్కడి నుంచైనా చేసుకునే వెసులుబాటు ఉండడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.

కడప కలెక్టరేట్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు కూటమి సర్కారులో అర్హులైన పేదలందరికీ రైస్‌కార్డులు ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో నెల రోజుల వ్యవధిలోనే జిల్లాలో అర్హులైన పేదలు రైస్‌కార్డుల మార్పులు, చేర్పులు, సవరణల కోసం కోసం దాదాపు 40 వేల దరఖాస్తులు రావడం గమనార్హం. సచివాలయాల్లో పేదల రైస్‌కార్డుల కోసం పోటీపడి దరఖాస్తులు చేసుకుంటున్నారు. సర్వర్ ప్రాబ్లమ్, సాంకేతిక ఇబ్బందుల కారణంగా సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. ఇలాంటి పరిస్థితులను పసిగట్టిన ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు అందించాలనే లక్ష్యంతో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మనమిత్ర యాప్ అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్‌లో హాయ్ అనే మెసేజ్ పంపితే చాలు మీ మొబైల్ ఫోన్ ద్వారానే దరఖాస్తులు చేసుకొనే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడంతో దరఖాస్తుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.

మనమిత్ర వాట్సాప్ (9552300009) రైస్‌కార్డు సేవలు

రైస్‌కార్డుల విభజన, అడ్రస్ మార్పులు, కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, కార్డులు వద్దంటే సరెండర్ వంటి 8 రకాల సేవలను నేరుగా మొబైల్ ఫోన్ ద్వారా దరకాస్తు చేసుకొనే వెసులుబాటు మనమిత్ర వాట్సాప్ సేవలను ప్రభుత్వం కల్పించింది. వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర సేవలకు 9552300009 నెంబర్‌కు మెసేజ్ పెడితే చాలు వెంటనే పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయి. మొబైల్ ఫోన్‌లో మన మిత్ర వాట్సాప్ చాట్‌లోకి వెళ్లి హాయ్ అని టైప్ చేస్తే సేవలను ఎంచుకోండి అని వస్తోంది. దాన్ని క్లిక్ చేస్తే పౌర సేవలను ఎంచుకోండి అనే బాక్స్‌లో సివిల్ సప్లయ్ సేవలపై క్లిక్ చేయాలి. అప్పుడు దీపం పథకంలో గ్యాస్ సిలిండర్ స్థితి, రైస్ డ్రా, రైస్ ఈకేవైసీ, రైస్ కార్డు సమర్పణ, రైస్‌కార్డులో సభ్యులను జోడించడం, తొలగించడం, తప్పుగా నమోదైన ఆధార్ కార్డు సీడింగ్ సవరణ, రేషన్ కార్డు విభజన దరఖాస్తులు అనే 8 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి. అందులో మీకు అవసరమైన సేవలను ఎంపిక చేసుకొని వివరాలు పూరించి వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. తరువాత రెవెన్యూ సివిల్ సప్లయ్ అధికారుల విచారణ అనంతరం అర్హులైతే మూడు వారాల్లోగా కొత్త రైస్‌కార్డు ప్రభుత్వం జారీ చేయనుంది.

ఏటీఎం కార్డు తరహాలో రైస్‌కార్డు ?

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించింది. రేషన్ కార్డులను ఏటీఎం కార్డుల తరహాలోనే రూపొందించనుంది. అంతేకాకుండా సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉన్న రైస్ కార్డును, ఆరోగ్యశ్రీ, సంక్షేమ పథకాలకు వేర్వేరుగా ముద్రించేందుకు కసరత్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా పేదల బియ్యాన్ని చాలా మంది తినక పోవడం లాంటి కారణాల రీత్యా పేదల బియ్యం అక్రమ రవాణాకు దారీ తీస్తుంది. ఇలాంటి కారణాల రీత్యా రైస్‌కార్డును అర్హులందరికీ ఇస్తూనే, రైస్ వద్దనే వారికి ఆ కార్డును రద్దు చేయనుంది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన స్మార్ట్‌కార్డులు రైస్‌కార్డుకు సంబంధం లేకుండా వారికి అందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పద్ధతి అమలైతే పేదల బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్టతో పాటు ప్రభుత్వానికి ఆర్థికంగా కొంత వెసులుబాటు కలగనుంది. అంతేకాకుండా కార్డుదారులకు డీలర్ నుంచి ఏదైనా అసౌకర్యం కలిగినా, ఇతర కారణాల రీత్యా ఫిర్యాదులు చేసేందుకు క్యూఆర్ కోడ్ పద్ధతి తేనుంది.

సంక్షేమ పథకాల కోసం సంపన్నుల ఆరాటం

ప్రభుత్వాలు ఎన్ని మారినా సంక్షేమ పథకాల కోసం సంపన్న వర్గాల్లో కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. పేదల ఆర్థికాభివృద్ధికి అందించే సంక్షేమ పథకాలను అడ్డదారుల్లో రేషన్‌కార్డులు సంపాదించి పేదల కడుపు కొట్టే వారి శాతం జిల్లాలో ఎక్కువే. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత వైద్యం, ఇంటి స్థలాలు, గృహాలు మంజూరు మొదలు అనేక సంక్షేమ పథకాల లబ్ధికి పాకులాడుతుండడం పేదలకు శాపంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 5.76 లక్షల తెల్లకార్డులుంటే దాదాపు 18 లక్షల మంది సభ్యులకు బియ్యం అందుతోంది. అయితే మిద్దెలు, మేడలు, భూ స్వాములు, ఇన్‌కంటాక్స్ కట్టే వారి చేతిలో 10 శాతానికి పైబడి రైస్ కార్డులున్నట్లు అధికారులే చెబుతున్నారు. వీరు రైస్‌ను తినక, అమ్మకాలు చేయడం వల్లనే అక్రమంగా పేదల బియ్యం తరలిపోతుందనే విమర్శలు చేస్తున్నారు. కూటమి సర్కారులో ఇలాంటి వారిని గుర్తించేలా కార్డులు రద్దు చేస్తే ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చంటారు.

జిల్లాలో ఇప్పటి వరకు 40 వేల దరఖాస్తులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 3416 తెల్లరేషన్ కార్డులకు అర్హులను గుర్తించారు. కానీ వీరికి రైస్‌కార్డులు జారీ కాలేదు. వారందరికీ అర్హతలు ఉంటే రైస్‌కార్డు జారీ చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మళ్లీ, మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కానీ అప్పట్లో దరఖాస్తులు చెల్లుతాయో లేదోననే సందేహంతో స్ప్లిట్టింగ్, న్యూ కార్డుల కోసం మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇకపోతే జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే స్ప్లిట్టింగ్ కార్డులకు 3300, సభ్యుల చేరికలకు 30,500, తొలగింపులకు 710, చిరునామా మార్పులకు 1305, ఆధార్ రాంగ్ సీడింగ్ 350, కార్డుల సరెండర్‌కు 6 మంది వరకు దరఖాస్తులు చేసుకున్నారు. అర్హతల మేరకు నిరంతరంగా రైస్‌కార్డులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండడంతో దరఖాస్తుల సంఖ్య 50 వేలకు దాటినా ఆశ్చర్యం లేదంటున్నారు.

హత్యాచార నిందితుడు ఆత్మహత్య

● మైలవరం జలాశయంలో శవమై తేలాడు


రహమతుల్లా (ఫైల్)

జమ్మలమడుగు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం అయ్యవారి కంబాలదిన్నెలో గత నెల 23న మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం చేసిన నిందితుడు రహమతుల్లా (26) మృతదేహం మైలవరం జలాశయంలో బుధవారం ఉదయం లభ్యమైంది. చర్చిలో ఓ వివాహానికి హాజరైన ప్రొద్దుటూరుకు చెందిన దంపతుల కుమార్తె (3)కు మాయమాటలు చెప్పి ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి నిందితుడు హత్యాచారం చేసిన విషయం విదితమే. కాగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళుతుండగా పరారయ్యాడు. అప్పటి నుంచి పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడు బుధవారం మైలవరం జలాశయంలో శవమై తేలాడు. పోలీసుల గాలింపు చర్యలతో భయపడిన నిందితుడు కొద్దిరోజుల క్రితమే జలాశయంలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు జలాశయం వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం నిందితుడి బంధువులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని తీసుకునేందుకు బంధువులు నిరాకరించడతో చివరకు జమ్మలమడుగు మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చి దహన సంస్కారాలు చేశారు.

జమ్మలమడుగు డీఎస్పీ ఏమన్నారంటే..

నిందితుడు దూదేకుల రహమతుల్లాను పోలీసులు ఘటన రోజే అదుపులోకి తీసుకున్న మాట వాస్తవమేనని, కానీ అదేరోజు పోలీసుల నుంచి నిందితుడు తప్పించుకున్నట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం మైలవరం జలాశయంలో శవం ఉన్నట్లు స్థానికులు పోలీసుల దృష్టికి తేవడంతో తమ సిబ్బంది వెళ్లి పరిశీలించి మృతుడు రహంతుల్లాగా గుర్తించి నట్లు తెలిపారు.

కిటకిటలాడిన అంగళ్లు సంత


కిటకిటలాడుతున్న అంగళ్లు గొర్రెల సంత

● రూ.2 కోట్లకు పైగా వ్యాపారం
● బక్రీద్ ఎఫెక్ట్...

కురబలకోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సమీపిస్తుండటంతో మండలంలోని అంగళ్లలో ప్రత్యేకంగా బుధవారం నిర్వహించిన గొర్రెల సంత కిటకిటలాడింది. ప్రతి వారం మండలంలో శనివారం గొర్రెల సంత నిర్వహిస్తారు. అయితే ప్రతి ఏడాది బక్రీద్ పండుగకు ముందుగా వ్యాపారుల సౌకర్యార్థం వారంలో ఒకసారి అదనంగా సంతను నిర్వహించడం ఆనవాయితీ. బక్రీద్ పండుగకు ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం సర్వసాధారణం. ఈనెల 7వ తేదీ బక్రీద్ పండుగ సందర్భంగా సాధారణ సమయాల్లో కంటే రెట్టింపు స్థాయిలో గొర్రెలు, పొట్టేళ్లు, మేకపోతులు క్రయ, విక్రయాలకు వచ్చాయి. దీంతో పాటు సాధారణ సమయాల్లో కంటే రెట్టింపు స్థాయిలో ధరలు భారీగా పెరిగిపోయాయి. సంతకు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారే కాకుండా కర్నాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులు, అమ్మకపుదారులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. దీంతో దాదాపుగా రూ.రెండు కోట్ల రూపాయలకు పైగా వ్యాపార లావాదేవీలు జరిగాయి. సంతలో కశ్మీరీ జాతి పొట్టేళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంతలో ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

కుంటుపడిన లక్ష్యం

● సగం కూడా పూర్తికాని సంజీవని కుంటలు
● 1864కు వెయ్యి పూర్తి
● వల్లూరులో ఎనిమిది చోట్ల ప్రారంభం కాని పనులు


నీటి కుంటలు తవ్వుతున్న కూలీలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల పెంపే లక్ష్యంగా చేపట్టిన సంజీవని కుంటల పనులు మందకొడిగా సాగుతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో కుంటల తవ్వకానికి ఐదు సెంట్ల భూమి కేటాయించాల్సి రావడంతో చిన్న, సన్న కారు రైతులు కొంతవరకు ఆలోచనలో పడ్డారు. వారిలో అవగాహన తీసుకువచ్చి వారిని ఒప్పించేందుకు ఉపాధి హామీ యంత్రాంగం అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షాలు పడకముందే కుంటల తవ్వకాలు పూర్తయ్యే విధంగా పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షాలు మొదలై నాటికి పూర్తి చేయాలనే గడువు నిర్ణయించుకున్నారు. జిల్లాలో 1843 నీటి కుంటలు మంజూరు కాగా ఇప్పటి వరకు వెయ్యి మాత్రమే పూర్తి చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

వెయ్యి మాత్రమే పూర్తి

ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోరి చేపడుతున్న నీటికుంటల పనులు నత్తనడకన సాగుతున్నాయి. మే 31 నాటికి పూర్తి చేసుకోగలిగితే నైరుతి రుతుపవనాల ద్వారా వచ్చే వర్షాలకు సంబంధించిన నీటితో ఈ కుంటలు నింపేవారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పనులు ఊపందుకోవడం లేదనేది స్పష్టమవుతుంది. కమలాపురం నియోజకవర్గంలోని వల్లూరు మండలంలో 8 పనులను ఇప్పటివరకు కూడా ప్రారంభించని పరిస్థితి ఉంది. మొత్తం మీద ఈ నియోజకవర్గంలో 482 నీటి కుంటలు మంజూరు కాగా 474 పనులు ప్రారంభించారు. మే నెలాఖరు నాటికి 239 పనులు పూర్తి చేయగలిగారు. బద్వేలు నియోజకవర్గంలో 337 పనులకు గానూ 176 పూర్తయ్యాయి. జమ్మలమడుగు నియోజకవర్గంలో 253 పనులకు 149, మైదుకూరు నియోజకవర్గంలో 153 పనులకు 83, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 20 పనులను ప్రారంభించగా 18 పనులు పూర్తి చేశారు. పులివెందుల నియోజకవర్గంలో 522 పనులకు 266, రాజంపేట నియోజకవర్గంలోని సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో 97 పనులకు 67 పనులు పూర్తయ్యాయి. ఈ విధంగా జిల్లా మొత్తం మీద 1856 పనులు ప్రారంభిస్తే వెయ్యి నీటి కుంటలను తవ్వారు. మిగిలిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన నీటి సంజీవని కుంటల తవ్వకం పనులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్నారు. ఒక్కో కుంటకు రూ.35 వేలు ఖర్చవుతుందనేది అంచనా. ఒక కుంటకు 125 పనిదినాలను కేటాయిస్తున్నారు.

నీటి కుంటలతో ప్రయోజనాలు

వర్షం నీటిని ఒడిసిపట్టడం వల్ల భూగర్భజల నీటిమట్టం పెరిగి పంటల సాగుకు అవసరమైన నీటి వనరు అందుబాటులోకి వస్తుంది. రైతుకు ప్రయోజనం కలిగించేందుకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తుంది. నీటి కుంటల్లో నీరు నింపడం వల్ల పంటల సాగుకే కాకుండా పశు పక్ష్యాదులకు సైతం దాహార్తి తీర్చుకునేందుకు కూడా ప్రయోజనం కలుగుతుంది. నీటికుంట గట్టు చుట్టూ కూరగాయలు, పండ్ల మొక్కలు సాగు చేయడం వల్ల రైతుకు మరింత ఆదాయం చేకూరే అవకాశం కలుగుతుంది. నీటి కుంటలో చేపల పెంపకం కూడా చేపట్టవచ్చు. పంటల సాగుకు సస్యరక్షణ కోసం ఈ నీటి కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయి.

పూర్తి చేసేందుకు చర్యలు



జిల్లాలో మంజూరైన నీటి కుంటల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మే 31 నాటికి జిల్లాలో 1271 పూర్తి చేయాలన్నది లక్ష్యంగా ఉంది. అయితే 816 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి పూర్తి చేసేందుకు సిబ్బందికి తగిన సూచనలు ఇస్తున్నాం.

- ఆదిశేషారెడ్డి, పీడీ, డ్వామా

చల్లంగా చూడమ్మా...
కోర్టులో గంగమ్మ
6

లక్ష మొక్కలు లక్ష్యం
● మొదటి విడతలో 50 వేల మొక్కలు సరఫరా
● సెర్ఫ్ సిబ్బందికి డీఆర్డీఏ పీడీ ఆదేశాలు
7

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

● వైసీపీ నేతలు అంజాద్‌బాషా, సురేష్‌బాబు, రామచంద్రారెడ్డి



ర్యాలీగా వస్తున్న వైసీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన మాత్రమే కొనసాగుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం కడప నగరంలో వైసీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని ఆ పార్టీ నగర అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేవలం కక్షసాధింపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉందని, అభివృద్ధి, సంక్షేమం రెండు గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర స్థాయి నాయకులతో పాటు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మండల నాయకులు, మహిళా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అడ్‌హాక్ అధ్యాపకుల నిరసన

కలికిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్‌హాక్ పద్ధతిలో పనిచేస్తున్న దాదాపు 60 మంది అధ్యాపకులు బుధవారం ప్రిన్సిపాల్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది తమను ఉద్యోగాల నుంచి తొలగించి 10 రోజుల తరువాత తిరిగి విధుల్లో చేర్చుకొనే వారని, ఈ ఏడాది మాత్రం తమను చేర్చు కోకుండా తాత్సారం చేస్తున్నారని తెలిపారు. గతేడాది అధ్యాపకులు నిర్వహించిన పురోగతిపై ఫర్మార్మెన్స్ నివేదికలు ఇవ్వాలని, ఆ తరువాత మాత్రమే విధుల్లోకి తీసుకుంటామని ప్రిన్సిపాల్ చెబుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. ప్రతి అడ్‌హాక్ అధ్యాపకుడు గతేడాది పనితీరుకు సంబంధించి తప్పనిసరిగా నివేదికలు సమర్పించాలని, అనంతపురం జేఎన్టీయూ వీసీ, రిజిస్ట్రార్ ఆదేశించారన్నారు. ఆ మేరకు ఫర్మార్మెన్స్ నివేదికలను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. దీనికోసం డిపార్టుమెంట్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, గతేడాది కొత్తగా చేరిన వారితో పాటు పాత అధ్యాపకుల్లో ఒకరు సమీక్షకు హాజరై నివేదికలు అందజేశారన్నారు. అనంతపురం, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచార ముందని, ఇక్కడ మాత్రమే నివేదికలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని ప్రిన్సిపాల్ విశదీకరించారు. ఇది వీసీ, రిజిస్ట్రార్లు తీసుకున్న నిర్ణయం కూడా కాదని ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారమే నివేదికలు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ వివాదంపై ఉన్నత స్థాయి యాజమాన్యానికి నివేదిస్తామని కూడా చెప్పారు.

పాత కక్షలతో దుకాణం ధ్వంసం



షాపులోని వస్తువులను చిందరవందరగా పడవేసిన దృశ్యం

నందలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవ పల్లెలోని లక్ష్మీనరసింహ ఎలక్ట్రికల్ షాపును జాసర్ అనేవ్యక్తి పాత కక్షలతో ధ్వంసం చేశాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. మంగళవారం వెంకటరమణ తన షాపును రాత్రి 9.30 గంట లకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. సుమారు 11.30 గంటల సమయంలో జాసర్ తన షాపు షట్టర్ పగులగొట్టి అక్రమంగా షాపులోనికి ప్రవేశించి షాపులోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు రూ.10 వేలు తీసుకెళ్లాడు. వెంకట రమణ మాట్లాడుతూ గతంలో జాసర్ అరవపల్లెలోని క్రీడా మైదానంలో తన స్నేహితులతో మద్యం సేవిస్తూ ఉండేవాడని, ఈ విషయం తాము చూసి అతన్ని, స్నేహితులను మందలించి అక్కడ మద్యం తాగకుండా చేశామన్నారు. ఈ విషయాన్ని మన సులో పెట్టుకొని కక్షతో తన షాపును ధ్వంసం చేశాడని ఆరోపించారు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

15న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలో కళాంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15న కాకతీయ విద్యాలయంలో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కళాంజలి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని ఈ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయ, లలిత, భక్తి సంగీతం, సినిమా పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

జూలై 29 లోపు దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం ఆరో తరగతిలో చేరే విద్యార్థులు జూలై 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ ప్రధానాచార్యులు ఎం.గీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య, కడప జిల్లాల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే విద్యార్థులు నవోదయలో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ జంగంవారిపల్లికి చెందిన నారాయణ రెడ్డి మనుమరాలు నందిత(16) తల్లిదండ్రులు చనిపోవడంతో తాతవద్దే ఉంటోంది. రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ. 2.10 లక్షలు ఆర్థిక చేయూత

కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మైదుకూరుకు చెందిన వెలుతుర్ల లక్ష్మి ఉమాదేవికి కాలు సర్జరీ వైద్య ఖర్చుల నిమిత్తం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రూ.2.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలసి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. సీఎం నారా చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర పర్యటనలో భాగంగా 2025 జనవరి 18న మైదుకూరులోని బాధితురాలి ఇంటికి వచ్చినప్పుడు ఆమె ఆరోగ్య విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైద్య ఖర్చుల కోసం అవసరమైన సహాయం చేయాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ బుధవారం బాధిత కుటుంబానికి పై ఆర్థిక సహాయం అందించారు.

నేటినుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



కొలువైన వేణుగోపాలస్వామి

పెనగలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనగలూరులో గురువారం నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ధర్మకర్త జేసీ సుబ్బయ్య గ్రామ పురోహితుడు వీసీ సుబ్బనరసయ్యలు తెలిపారు. 5న అంకురార్పణ, 6న ధ్వజారోహణం, 7న చిన్న శేష వాహనం, 8న సింహ వాహనం, 9న హనుమంతు వాహనం, 10న గరుడ వాహనం, 11న కల్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న అలకలదోపు, 14న వసంతోత్సవం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

రోడ్డు వెయ్యరు.. గుంతలు పూడ్చరు

- ప్రభుత్వం మారినా తీరని వెతలు
- దశాబ్దాలుగా వెయ్యని రోడ్లు
- బాటసారులు వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గుంతల్లో వర్షపు నీరు

సుండుపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సంక్షేమ పథకాల పేరుతో అభివృద్ధిని తుంగలో తొక్కేశారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. దళితవాడలు, గిరిజన గ్రామాలు, మారుమూల పంచాయతీలకు సైతం రోడ్లు వేయకుండా కాలయాపన చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆరు నెలల క్రితం పల్లె పండుగ పేరిట కోట్లాది రూపాయల నిధులను విడుదల చేశారు. ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల రహదారుల్లో గుంతలు లేకుండా వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అయితే పల్లెపండుగ పేరిట విడుదలైన నిధులు పలుచోట్ల సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. కానీ సుండు పల్లె మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల పల్లె లకు పోయేందుకు రహదారులు ఏర్పాటు చేసేం దుకు మాత్రం మొగ్గుచూపడం లేదని తీవ్ర విమ ర్శలు వస్తున్నాయి. అధికారులు, కూటమి నాయ కులు ప్రయాణికులకు, వాహనదారులకు రోడ్డు సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సుండుపల్లె గ్రామ పంచాయతీలోని సాకలపల్లి, కుమ్మరపల్లి, కొత్తవడ్డిపల్లె, రవీంద్ర నాథ్‌రెడ్డి కాలనీ, ఎగువమాలపల్లి, పోచంపల్లి, చీకటిపల్లి, పోచంవాండ్లపల్లి, ఎల్లారెడ్డిగారిపల్లెలకు వెళ్లే రహదారి దశాబ్దాల కాలం నుంచి గుంతల మయంగా మారింది. ఆ పల్లెల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కాలినడకన రావాల్సిన పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయమని పలుమార్లు గత ప్రభుత్వంలో వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికులు సీఎం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే అగ్రహారం నుంచి ఏటిగడ్డ రాచపల్లి సామిసేనిగడ్డ, గుట్టకాడ బలిజపల్లి, మల్లక్కగారిపల్లె, బలిజపల్లెతో పాటు మరికొన్ని పల్లెలకు సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనంలో సుండుపల్లెకు పోవాలన్నా, రావాలన్నా గుంతలమయంగా ఉన్న రోడ్డుతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అగ్రహారం సమీపం నుంచి సామిసేనిగడ్డ వరకు పూర్తిగా రోడ్డు గుంతలు గుంతలుగా మారింది. కొన్నిచోట్ల వర్షపు నీటికి కోతలకు గురైంది. ప్రభుత్వం తక్షణం స్పందించి తారురోడ్డు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు, పాలకులకు వినతిపత్రం ద్వారా తమ సమస్యలను తెలియజేశామని చెబుతున్నారు.

చెరువులను తలపించినా పట్టించుకోరా...

మండల కేంద్రంలో రహదారులు గుంతల మయంగా మారాయి. సుండుపల్లె- రాయవరం ప్రధాన రహదారి కెనరా బ్యాంకు వద్ద సుమారు మీటర్ లోతు రోడ్డుపై వర్షపు నీరు, మురికినీరు నిలుస్తోంది. వర్షం పడినా పడకపోయినా అక్కడ మురికినీరు నిలువ ఉండడం వలన బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఆ రహదారిన వెళ్లేందుకు మొగ్గు చూపడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. ఎంపీడీవో కార్యాలయం పక్కన 20 మీటర్ల వ్యవధిలో సీసీ రోడ్డు గుంతలమయంగా మారి మురికికుంటను తలపిస్తోంది. రాయచోటి ప్రధాన రహదారిలో మాదిగపల్లె సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలకు దారితీస్తోంది. ఇదంతా నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాలకులు, ప్రజలు వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇదంతా తెలిసినా.. చూసినా మండల అభివృద్ధి అధికారి సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తు న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మండల కేంద్రంలో ఏ ఒక్క అభివృద్ధి పనికి ఎంపీడీవో ముందుకు రావడం, చేయడం లేదని విమర్శలు ఉన్నాయి.

గుంతలు పూడ్చుతాము

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

గుంతలు ఏర్పడిన చోట పూడ్చుతాము. వర్షం కారణంగా గుంతల్లో వర్షపు నీరు చేరింది. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటం వలన గుంతలు ఏర్పడ్డాయి. సమస్య పరిష్కరిస్తాము.

ఆటోలు కూడా రావు

- సంతోషమ్మ, పోచంవాండ్లపల్లె



సరైన రోడ్డు లేక పోవడం వలన ఆటోలు కూడా రావడం లేదు. మండల కేంద్రానికి పోవాలంటే సుమారు ఐదు కి.మీ. నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొన్ని సంవత్సరాలుగా రోడ్డు వేయమని వేడుకుంటున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి.



గుంతల మయంగా బలిజపల్లి రోడ్డు

చల్లంగా చూడమ్మా... కోర్టులో గంగమ్మ







కోర్టులో గంగమ్మ ఆలయంలో అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు, జాతరలో కళాకారులు, ప్రత్యేకాలంకరణలో కోర్టులో గంగమ్మ

- వైభవంగా కోర్టులో గంగమ్మ జాతర
- జాతరలో జన సందోహం

మదనపల్లె అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు ఆవరణలో వెలసిన గంగమ్మ జాతర బుధవారం అత్యంతవైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి ఆనవాయితీ మేరకు మున్సిపల్ మాజీ చైర్మన్ జోలెపాళెం భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి తమ్ముడుగా భావిస్తున్న దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం ముందు ఉన్న పోతురాజు తరఫున ఆలయ ఈవో రమణ, టీడీపీ నాయకుడు రామకృష్ణ గంగమ్మకు చీర, సారె సమర్పించారు. మేళతాళాలు, చెక్క భజనలు, పిల్లనగ్రోవి వాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకుని వచ్చి ప్రతిష్ఠించారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున ఆలయ ఆవరణలో గంగమ్మను ఆలయకమిటీ సభ్యులు ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు దివ్వెలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మదనపల్లె డీఎస్పీమహేంద్ర తన సిబ్బందితో కలిసి అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సిరిమానుకు మహిళలు పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖులు కుటుంబసమేతరంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించు కున్నారు. మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు, ప్రజలే కాకుండా కర్ణాటక రాష్ట్రం, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయకమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పురి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, జోలెపాళెం కరుణాకర్‌నాయుడు, మార్పురి మహేష్, మార్పురి విక్కి, జోలెపాళెం దేవేంద్ర(చిన్ని), బోయపాటి శ్రీనివాసులు నాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి, మల్లికార్జున నాయుడు పర్యవేక్షించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అభివృద్ధితో రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తన తండ్రి కాలం నుంచి తమను ఆదరిస్తున్న వాల్మీకిపురం తమకు పుట్టినిల్లు కంటే ఎక్కువని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వందలాది బైకులతో ర్యాలీగా మార్కెట్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తనను ప్రజలు ఎంతగానో ఆదరించారని అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. పీలేరు నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారం కోసం రూ.2వేల కోట్లతో గండికోట ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం రెండేళ్లలో పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హంద్రీనీవా పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్షపూరిత రాజకీయాలు చేయడమే కాకుండా రాష్ట్ర ప్రజల సంక్షేమం గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం సీఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయనను విమర్శించే అర్హత వైఎస్ జగన్‌కు లేదన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోసూరి చంద్రమౌళి, వైస్ చైర్మన్‌గా నౌషాద్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. చివరగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాలలో సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ ఇంతియాజ్‌అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు కృష్ణారెడ్డి, పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, జగన్నాథరెడ్డి, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, సురేంద్రవర్మ, బొక్కసం బ్రదర్స్, మురళి, డిష్ బ్రదర్స్ కువైట్ బాబు, ఆదినారాయణ, సయ్యద్‌బాషా, రాజగోపాల్, సాంబ, గాంధీపేట రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకం కింద 3 కిలోవాట్ల పవర్‌కు రాయితీ

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద 3 కిలోవాట్ల పవర్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.78 వేల రాయితీ ఇవ్వబడుతుందని, ఒక కిలో వాట్ పవర్ సోలార్ ఇన్‌స్టాలేషన్ ద్వారా 120 విద్యుత్ యూనిట్ల ఉత్పత్తి జరుగుతుందని, బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అదనంగా 20 వేలు రాయితీ ఇవ్వబడుతుందని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించే పాలసీ రూపకల్పన జరగనుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఈఈలు, నెడ్‌క్యాప్ సిబ్బంది, జిల్లాలో సోలార్ ఇన్స్టాల్ చేసే వెండర్లు, ఎంపీడీవోలు, తదితరులతో అన్నమయ్య జిల్లాలో సీఎం సూర్య ఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిలాలి యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో ప్రారంభించారని, ఈ పథకం ద్వారా ప్రజలు తమ ఇళ్లపై సోలార్ ప్యానల్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని సోలార్ విద్యుత్‌ను వాడుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్‌శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాష్ట్రానికే ఆదర్శంగా ఆటోమిషన్ కిచెన్‌లు : కలెక్టర్



కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆటోమిషన్ సెంట్రల్ కిచెన్‌ల ద్వారా రాష్ట్రానికే ఆదర్శంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆటోమిషన్ సెంట్రల్ మోడల్ కిచెన్ నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటవుతున్న ఆటోమిషన్ సెంట్రల్ కిచెన్స్ నిర్మాణ పనులను పారదర్శకంగా అత్యంత ప్రాధాన్యతతో నూతన విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఎలా నిర్వహిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అక్కడి వంట గదులను పరిశీలించారు. సరుకులు, వంటచెరకు, వంట గ్యాస్ తదితర వంట నిర్వహణకు అయ్యే ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో షంషుద్దీన్, ఆగ్రోస్ ఎండీ జోయల్ విజయకుమార్, హౌసింగ్ పీడీ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

వస్తు సేవా పన్నుల రిజిస్ట్రేషన్లను విస్తరించాలి

జిల్లాలో వస్తు సేవా పన్నుల నమోదును విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూరుతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో జీఎస్టీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వస్తు సేవల పన్నుల రిజిస్ట్రేషన్లను విస్తరించాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ ట్యాక్స్ పన్నులను డిమాండ్ మేరకు వసూలు చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు, కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు అందరూ జీఎస్టీ పన్నుల పరిధిలోకి వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిద్దె పంట.. ఆరోగ్యమే ఇంట

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మనకు కావాలసిన పోషక పదార్థాలు అందించడంలో పండ్లు కూరగాయలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కూరగాయల్లో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండడంతో మనిషి ఆహారంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అయితే మార్కెట్లోలభించే కూరగాయల్లో పురుగుమందుల అవశేషాలు, ఎక్కువ కాలం పాడవకుండా ఉండేందుకు రసాయనాలు వాడడం వల్ల అవి మానవుని శరీరంలో చేరి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో ప్రజలు తమకు అందు బాటులో ఉండే స్థలంలో డాబాలపైన కుండీల్లో సంచుల్లో కూరగాయలు, పండ్లు, పూలమొక్కలతో పాటు ఔషధ మొక్కలను సంవత్సరం పొడవునా పెంచుకోవచ్చు. ఈ మొక్కలు ఇంటి లోపల, వెలుపల పచ్చదనాన్ని పెంచి వాతావరణ కాలుష్యం తగ్గిస్తాయి. సేంద్రియ పద్ధతిలో పురుగుమందులు అవశేషాలు లేని తాజా కూరగాయలను పండించుకోవచ్చు.

ప్రదేశం ఎంపిక

ఎంచుకున్న ప్రదేశం మొక్కల పెంపకానికి అనువుగా ఉండాలి. మంచి వెలుతురు ఉంటే తెగుళ్లు తక్కువగా వస్తాయి. మిద్దె తోట ఏర్పాటుకు మొదట బిల్డింగ్ స్లాబ్ అనుకూలంగా ఉందా, లేదా అనేది పరిశీలించాలి. అందుకు అనుకూలంగా తేలికపాటి కుండీలను స్టాండ్ల మీద అమర్చుకుని సాగు ప్రారంభించాలి. ఒక చదరపు మీటరు స్లాబు సుమారు 250 కిలోల బరువు మోస్తుంది. అయితే స్లాబు పగలకుండా చూసుకోవాలి. బరువైన కుండీలు పిల్లర్స్‌కు దగ్గరగా అమర్చుకోవాలి. మొక్కల కోసం ఆరు నుంచి ఏడుగంటలు ఎండ తగిలే విధంగా ఉంటే బాగా పెరుగుతాయి. ఎండా కాలంలో సెట్ నెట్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల మొక్కలు పాడవకుండా కాపాడుకోవచ్చు.

కుండీల ఎంపిక ఇలా...

మురుగునీరు పోవడానికి రంధ్రాలు ఉన్న కుండీలనే ఎంచుకోవాలి. బంక మట్టి లేదంటే ప్లాస్టిక్‌తో చేసిన కుండీలను ఎంపిక చేసుకోవాలి. వివిధ రంగులు, పరిమాణం ఉన్న కంటైనర్లను కలిపి వాడితే ఆకర్షణీయంగా కనిపిస్తాయి. మొక్కలు పెరిగే ఎత్తును దృష్టిలో ఉంచుకుని కుండీలను ఎంచుకోవాలి. అదే విధంగా తొట్లలో ఏర్పాటు చేయాలనుకునే సందర్భంలో ఖాళీ స్థలాన్ని బట్టి కావాల్సినంత పొడవు 9 ఇంటు 20 ఇంచుల లోతు సిమెంటు తొట్లు, ప్లాస్టిక్ సంచులు ఉప యోగించుకుని మట్టి మిశ్ర మాన్ని (రెండు భాగాలు ఎర్ర మట్టి, ఒక భాగం ఇసుక) ఒక భాగం కంపోస్టుతో నింపుకుని పండ్లు , కూరగా యలు పెంచుకోవచ్చు. పై అంచు నుంచి అంగుళం వరకు ఖాళీని నీరు పెట్టడానికి వీలుగా వదలాలి.



మిద్దెపంటల సాగుపై శిక్షణ

మిద్దె పంటల సాగుపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దూరవు విద్య కోర్సు విధానం ద్వారా ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వారు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు ప్రతి ఏడాది శిక్షణ ఇస్తారు. ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ ఏడాది మిద్దె తోటల పెంపకంపై ఐదురోజుల పాటు శిక్షణ ఇచ్చాం.

- డాక్టర్ ఎస్.మానస, శాస్త్రవేత్త, ఉద్యాన విభాగం

కుండీలు నింపే పద్ధతి...

మార్కెట్లో అనేక పాటింగ్ మిశ్రమాలు లభిస్తాయి. మూడు భాగాలు కంపోస్టు ఎరువు, ఒక భాగం తేలిక బరువు ఉన్న కోకోపీట్‌తో కలిపి పాటింగ్ మిశ్రమం తయారు చేసుకోవచ్చు. నాటే కూరగాయలకు నారు మొక్కల పెంపకానికి లోతు తక్కువ. పల్లాలను మట్టి, ఇసుక, కంపోస్టు కలిపి విత్తనాలను చల్లాలి. మట్టి మిశ్రమాన్ని తొట్లు, బకెట్లు, ప్లాస్టిక్ సంచుల్లో నింపే ముందు వాటి అడుగు భాగాన నీరు పోయేలా రంధ్రాన్ని ఏర్పాటు చేయాలి. చిన్న చిన్న పెంకులతో నీరు పోయే రంధ్రాన్ని కప్పి ఉంచాలి. ఆ తరువాత గరుకు ఇసుక సమం చేయాలి. దానిపై ఒక అంగుళం మందంతో ఎండుటాకులు, కొబ్బరిపొట్టు పరిచి దానిపై మట్టి మిశ్రమాన్ని అంచు వరకు నింపాలి. ఇంటి మేడపైన మొక్కలు పెంచే కంటైనర్లను ఒక క్రమపద్ధతిలో అమర్చుకోవాలి. దీని వల్ల నీరు పోయడం కలుపుతీత, కోతకో అనువుగా మనిషి నడిచేందుకు అనువుగా ఉంటుంది. పెరపేట్ గోడపై ఆరు నుంచి ఏడు అడుగుల దూరంలో ఇనుప చువ్వలు నాటి వాటికి ట్రెల్లిస్ లాగా బైండింగ్ అల్లించాలి. వీటిపై తీగ జాతి కూరగాయలను పెంచుకోవచ్చు.

నీటి యాజమాన్యం

కంటైనర్లలో పెంచే మొక్కలకు సంవత్సరం పొడవునా నీరు అందించాలి. వేసవి కాలంలో మొక్కలకు రోజుకు రెండుసార్లు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కుండీలను పరీక్షిస్తూ వేరు వ్యవస్థ కిక్కిరిసి కలిసిపోకుండా చూసుకోవాలి. సంవ త్సరానికి ఒకసారి కుండీలను మార్చాలి. క్రమం తప్పకుండా మొక్కలకు పోషకాలను అందించాలి. కంపోస్టు ఎరువు వాడకం ద్వారా తగిన పోషకాలను అందించవచ్చు. ప్రతి సంవత్సరం కుండీలోని మట్టిపై రెండు నుంచి ఐదు సెంటీమీటర్ల ఎత్తు వరకు కంపోస్టు వేయాలి. మొక్కలకు మంచి పూత రావడానికి మే నుంచి సెప్టెంబరు వరకు పెంచే ఏకవార్షిక పంటలకు ఎరువులను ద్రవరూపంలో ఇవ్వాలి.

ఎరువుల వినియోగం

మొక్కలు బాగా పెరిగి అధిక దిగుబడులు ఇవ్వడానికి సేంద్రియ ఎరువుతో పాటు రసాయనిక ఎరువులు కూడా వేయాలి. వీటితో పాటు వర్మీకంపోస్టు నెలకొకసారి వేయాలి. వర్మీ కంపోస్టును రసాయినిక ఎరువుతో కలిపి వేయకూడదు. ఎక్కువ మోతాదులో ఎరువులు వేయడం హానికరం. ఎరువులు వేయగానే మొక్కలకు నీరు అందించాలి.

చీడపీడల నివారణ

చీడ పురుగులు తెగుళ్లు సోకిన మొక్కల భాగాలను కత్తిరించి నాశనం చేయాలి. కూరగాయల మొక్కల పెరుగుదల వాతావరణ పరిస్థితులను బట్టి అనేక పురుగులు తెగుళ్లు ఆశిస్తాయి. పెనుబంక, దీపపు పురుగు మొక్కల్లో తొలి దశలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలగజేస్తాయి. కొన్ని కూరగాయల పంటల్లో పండుఈగ, కాయతొలుచు పురుగులు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. పండ్లు, కూరగాయలు ఆశించిన లార్వాలను ఏరి నాశనం చేసి లీటరు నీటికి నాలుగు మిల్లీలీటర్ల వేపనూనె, రెండు మి.లీ టీ పాల్, సబ్బు ద్రావణం కలిపి పిచికారి చేయాలి. వర్షాకాలంలో కూరగాయ మొక్కలకు శిలీంధ్ర తెగుళ్లు, వైరస్ తెగుళ్లు ఆశించి నష్టపరుస్తాయి. రసం పీల్చు పురుగులను నీటిలో ఫోర్స్‌గా కడిగేయాలి. తడి మీద బూడిద చల్లాలి. ఆ తడికి బూడిద బాగా అంటుకుని పేనుబంకను నివారిస్తుంది. బూడిద అందుబాటులో లేకపోతే సబ్బు నీళ్లు కానీ కుంకుడుకాయ రసం కానీ షాంపు కానీ ఏదైనా నీటిలో కలిపి మొక్కలకు స్ప్రే చేయాలి. తీగజాతి కూరగాయల్లో బూడిద తెగులు నివారణకు పుల్లటి మజ్జిగ 30 మి.లీలకు ఒక గ్రాము ఇంగువ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయవచ్చు. చీడపీడల నివారణకు వేప, కానుగ, సీతాఫలం మొక్కల ఆధారిత ఆకుల కషాయాన్ని లేదంటే నూనె ఉప యోగించాలి.





జిల్లాలో సాగవుతున్న మిద్దెపంటలు

స్కూటర్ ఢీ... వ్యక్తి మృతి

ఖాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లెచెరువు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లూరు బాలస్వామి (47) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఖాజీపేటలోని బంగ్లా సమీపంలో వాటర్‌ప్లాంట్ నడుపుకుంటూ బాలస్వామి జీవనం సాగించేవారు. పని నిమిత్తం దుంపలగట్టుకు వెళుతుండగా వెనుకవైపు స్కూటర్‌తగల డంతో కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడపకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.



మృతి చెందిన బాలస్వామి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దువ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద నాలుగు రోడ్ల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వాసుదేవపురం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి (35) అనే వ్యక్తిని ఈనెల 2వ తేదీ ఆటో ఢీకొంది. సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.



సంజీవరెడ్డి మృతదేహం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కడప క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ నగరవనం సమీపంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కడప రవీంద్రనగర్‌కు చెందిన రామిరెడ్డి హరీష్‌రెడ్డి (32) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అలాగే రవీంద్రనగర్‌లో వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నాడు. రెండేళ్లక్రితం ఈయనకు వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై మంగళ వారం ఇంటి వద్ద నుంచి బయటికి వెళ్లి నగరవనం సమీపంలో కూల్ డ్రింక్‌లో విష పదార్థం వేసుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి.. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

లక్ష మొక్కలు లక్ష్యం

- మొదటి విడతలో 50 వేల మొక్కలు సరఫరా
- సెర్ప్ సిబ్బందికి డీఆర్డీఏ పీడీ ఆదేశాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి అన్నారు. ఆ మేరకు బుధవారం జిల్లాలోని సెర్ప్ సిబ్బందితో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5న ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడినట్లు ఆమె చెప్పారు. చాలా మంది తమ ఇంటి ఆవరణలో పండ్ల మొక్కలు పెంచేందుకు సుముఖత చూపుతున్నారని.. వారికి అవసరమైన నేరేడు, జామ, మామిడి, సీతాఫలం తదితర మొక్కలను నర్సరీ నుంచి తెప్పించి అందించాలని సూచించారు. మొక్కల ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఎంపీడీవోలను సంప్రదించాలన్నారు. ఒకేసారి లక్ష మొక్కలు నర్సరీలలో అందుబాటులో లేకపోవడం వల్ల మొదటి విడతగా 50వేల మొక్కలు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమం, బ్యాంకు రుణాలకు సంబంధించిన అంశాలపై సెర్ప్ సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు.



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

అనంతపురం, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 పురుషుల అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా బుధవారం అనంతపురం జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించగా... మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 13 పరుగుల తేడాతో గెలుపొందింది. వివరాలిలా.... వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 45.1 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రెడ్డి రుషి 60 పరుగులు, లోహిత్ లక్ష్మీనారాయణ 80 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు కేవలం 25.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి విజయకేతనం ఎగుర వేసింది. ఇందులో వీరారెడ్డి 69 బంతులలోనే 125 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచి విజయంలో కీలకంగా నిలిచారు. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 31 ఓవర్లలో 145 పరుగులు మాత్రమే చేసి అన్ని వికెట్లు కోల్పోయింది. స్వల్ప స్కోర్ ఛేదనే లక్ష్యంగా బరిలోకి దిగిన కడప జట్టు 37.4 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 13 రన్స్ తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది.



వీరారెడ్డి (125 నాటౌట్) (అనంతపురం)

రైతులకు విరివిగా సేవలు అందిస్తాం - నాబార్డు డీడీఎం

చాపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తామని కడప నాబార్డు డీడీఎం విజయవిహారి అన్నారు. చాపాడులో కొత్తగా రైతు ఉత్పత్తిదారుల పంపిణీ లిమిటెడ్ కార్యాలయాన్ని బుధవారం అధికారులు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా విజయవిహారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు సేంద్రియ ఎరువులు, వ్యవసాయ పరికరాలు పురుగుమందులు, మందుపైపులు, గొర్రులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. రైతులకు ఈ సంఘం అందుబాటులో ఉంటుందన్నారు. కేంద్ర ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సమన్వయ కార్యకర్త ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయనిక మందులు, ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులను పంటలకు ఉపయోగిస్తే ఆరోగ్యవంతమైన పంటల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లికార్జుననాయుడు, రైతు సంఘం పాలక సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబ్జి, ఓబుళరెడ్డి, సమీర్, సుబ్బరామయ్య, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఎం విజయవిహారి

ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి వ్యక్తి మృతి



కలసాపడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన బాలవెంకటరెడ్డి (60) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మరణించారు. పని నిమిత్తం బుధవారం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కాలు జారి తెలుగుగంగ ప్రధాన కాల్వ నీటిలో పడిపోయాడు. గ్రామస్తులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాలవెంకటరెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బాలిక అదృశ్యం

చాపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామ దళితవాడలో ఒక బాలిక (15) బుధవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

ఆ బాలిక తెల్లవారుజామున ఇంటిలోని కుటుంబ సభ్యులకు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆయకట్టు చెరువులపై అలసత్వం


- చిట్టడవిని తలపిస్తున్న చెరువుల కట్టలు
- మరమ్మతులకు నోచుకోని తూములు
- సాగుకు నోచుకోని పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

కాశినాయన జూన్ 4: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాగా ఉంది చిన్న నీటిపారుదల శాఖ అధికారుల తీరు. నిధుల లేమితో మండలంలోని ఆయకట్టు చెరువుల పరిస్థితి కొన్నేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందా ఉంది. ఆయకట్టు చెరువులకు నీరుచేరకముందే తూములకు, కట్టలకు ఏమైనా మరమ్మతులు ఉంటే చేపట్టాల్సిన అధికారులు చెరువుల దరిదాపులకు కూడా రావడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే వర్షాలు మొదలవుతున్నాయి. కొద్దోగొప్పో చెరువులకు నీరువచ్చి చేరే అవకాశం ఉంది. ఈ నీళ్ల పంటల సాగుకు ఉపయోగపడేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మండలంలో చెరువులు కుంటలు కలిపి దాదాపు 25 దాకా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణా లోపంతో ఇప్పటికే కొన్ని కనుమరుగయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోపు అధికారులు చెరువు కట్టలు, తూముల పరిస్థితిని సమీక్షించాల్సి ఉంది. కానీ అటువైపు అడుగులు పడటం లేదు. దీంతో ప్రస్తుతం చెరువుల పరిస్థితి అధ్వానంగా ఉందంటున్నారు రైతన్నలు. కట్టలు అన్నీ కూడా ముళ్ల కంప అల్లుకొని చిట్టడవులను తలపిస్తున్నాయి. చెరువుల వద్దకు వెళ్లి చూద్దామనుకున్నా వీలు కాని విధంగా ముళ్లకంప పెరిగి పోయిందని రైతన్నలు వాపోతున్నారు. ఓబుళాపురం, పిట్టిగుంట చెరువుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దాదాపు కిలోమీటర్ పొడవున్న ఈచెరువుకట్ట మీదుగా ట్రాక్టర్‌లు, ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు యధేచ్ఛగా తిరిగేవి. చెరువుకు ఆవల ఉన్న లింగారెడ్డిపల్లె, అక్కసిద్ధుపల్లె, పిడుగుపల్లె తదితర గ్రామాల విద్యార్థులు కట్టపై రాకపోకలు సాగిస్తూ చెన్నారెడ్డిపల్లెకు వచ్చి హైస్కూల్ విద్యాభ్యాసం చేసేవారు. నేడు చెరువుకట్ట కుచించుకపోయింది. చెరువు కింద భూములున్న రైతులు పండిన పంటను రైతులు, ట్రాక్టర్‌లతో, ఎడ్ల బండ్లతో ఇంటికి తోలుకోవాలన్నా వీలుగాని దుస్థితి నెలకొంది. కనీసం చెరువు కట్ట మీదుగా మనిషి నడిచిపోవాలన్నా కష్టతరంగా ఉందంటున్నారు రైతులు. గత కొన్నేళ్లుగా పిట్టిగుంట చిన్నచెరువు తూముకు షట్టర్ లేదు. దీంతో వచ్చిన నీరు వచ్చినట్టే బయటికి వెళ్లిపోతుంది. దీంతో చెరువుకు నీరు వచ్చినా కాలువలకు వదులుకొని పంటలు పండించుకొనే అవకాశం లేకుండా పోయింది. ఈ ఖరీఫ్ ప్రారంభమయ్యేనాటికైనా అధికారులు స్పందించి ముళ్ల కంప తొలగించడంతో పాటు చెరువు కట్టను వెడల్పు చేయించాలని, చెరువుల తూములకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వంలో చర్యలు చేపడతారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



పిచ్చిమొక్కలు, కంపచెట్ల నడుమ మరమ్మతులకు నోచుకోని పిట్టిగుంట చెరువు తూము



ఓబుళాపురం చెరువు కట్టపై దట్టంగా అల్లుకుపోయిన తుమ్మకంప

సతి ప్రచార సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



దండోరా కాలనీలో సతి ప్రచార కార్యక్రమంలో జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : పేద పిల్లల అభ్యున్నతి కోసం చేపడుతున్న సతి ప్రచార పత్రం సర్వేను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని దండోరా కాలనీలో సతి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్జి మాట్లాడుతూ సతి ప్రచార కార్యక్రమం ద్వారా ఆధార్ కోసం సర్వేతో పాటు ఆధార్ నమోదు, ట్రాకింగ్, న్యాయ సహాయము, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, సంబంధిత అధికారులు పాల్గొంటారన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది అయ్యవారప్ప, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వేముల మండలంలో షాదీఖానా నిర్మించాలి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న పేర్ల పార్థసారథిరెడ్డి

వేముల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేముల మండలంలోని ముస్లింలకు షాదీఖానా నిర్మించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను కోరారు. బుధవారం విజయవాడలో ఉన్న మంత్రిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధిరెడ్డి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అన్ని వర్గాలకు సీఎం మోసం'



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పులివెందుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారని కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినం సందర్భంగా బుధవారం పులివెందులలో వైసీపీ భారీ ర్యాలీ నిర్వహించింది. వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఆర్డీఓ చిన్నయ్యకు ఎంపీ వినతిపత్రం అందించి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి ,మార్కెట్ యార్డు మాజీచైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

కమలాపురం రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిపాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, వైసీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథశర్మ, వీరారెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురంలో వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గిడ్డంగివీధి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనం



చింతకొమ్మదిన్నెలో నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ భవనం

సీకేదిన్నె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్ భవనం విద్యార్థులు లేక నిరుపయోగంగా ఉంది. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం సంవత్సరం రోజుల నుంచి నిరుపయోగంగా ఉంది. విద్యార్థులు హాస్టల్‌లో అన్ని వసతులు ఉన్నప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వలన లక్షల రూపాయలు వెచ్చించి కట్టించిన హాస్టల్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడంతో పశువులు, పందులు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు అంటున్నారు. అధికారులు శ్రద్ధ వహించి పాఠశాలు తెరిచేలోగా హాస్టల్ భవనాన్ని విద్యార్థులకు అనుకూలంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారు నగల అపహరణ

కడప క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మరాఠీవీధిలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని దొంగలు బంగారునగలు అపహరించినట్లు తాలూకా ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. మరాఠీవీధికి చెందిన మహేశ్వరిబాయి గత నెల 31న తీర్థ యాత్రలకు వెళ్లి తిరిగి సోమవారం ఇంటికి వచ్చింది. అయితే బీరువాలో 47గ్రాముల బంగారు నగలు దొంగలు అపహరించినట్లు తెలిపారు. కాగా బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైసీపీ వెన్నుపోటుపై మాట్లాడటం హాస్యాస్పదం







పులివెందుల టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న లతారెడ్డి, మాట్లాడుతున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల మధు, ముగ్గులను పరిశీలిస్తున్న జనసేన నాయకుడు జీవీ రమణ

పులివెందుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు వెన్నుపోటు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సతీమణి లతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా కార్యకర్తలతో కలసి లతారెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తూగుట్ల సిద్ధారెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు పొడిచింది జగనే

పులివెందుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అధికారాన్ని కట్టబెడితే ఐదేళ్లలో వారికి వెన్నుపోటు పొడిచింది మాజీ ముఖ్యమంత్రి జగనే అని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీ సర్కిల్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా కేక్‌కట్ చేసి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూరు..: రాష్ట్రంలో ఐదేళ్లపాటు ప్రజలు అష్టకష్టాలు అనుభవించారని గొడ్డలిపోటు పార్టీ నేతలుగా పేరు పొందారని అలాంటి పార్టీ నేతలు వెన్నుపోటు కార్యక్రమం చేయడం సబబేనా,ఇలాంటి పద్ధతిని ప్రజలు తిప్పికొడతారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి అన్నారు. చెన్నూరులో బుధవారం ఆయన మాట్లాడుతూ ఏడాది పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ ఇలాంటి కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలుసు కాబట్టి ఏమాత్రం పట్టించుకోర న్నారు.

వైసీపీ అరాచకపాలన అంతమై రాష్ట్రానికి మహర్దశ

కడప మారుతీనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ అరాచక పాలన విరగడై సరిగ్గా సంవత్సర కాలం పూర్తికాబడి రాష్ట్రానికి కూటమి పాలనలో మహర్దశ పట్టుకుందని జనసేన పార్టీ జిల్లా నాయకుడు జీవీ రమణ అన్నారు. ఇందుకనుగుణంగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ పిలుపు మేరకు జిల్లా నాయకులు జీవీ రమణ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక దేవునికడప ఆలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళి, ఆకుల గోపి, తాజ్‌షరీఫ్. రాజగోపాల్, తోట సుమంత్, సాయి, ఉంగరాల విజయ్, అబ్దుల్‌మాలిక్, మహేశ్, తోటనాగరాజు, నరసింహ, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్నట్లు టీడీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె..: కూటమి ప్రభుత్వం సంవత్సరం దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం తెలుగుదేశంపార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు లయన్‌పటాన్ ఖాదర్‌బాష, 39వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ ఆరిఫ్ ఆధ్వర్యంలో పెద్దదర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారుక్, నీ ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

కృషి, సంకల్పంతోనే పాడిపంటలు

వల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పరిధిలోని తోళ్లగంగనపల్లె, గోటూరు గ్రామాల్లో కృషి విజ్ఞాన్ కేంద్రం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ఏడో రోజు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ మంగేశ్ దుదే శాస్త్రవేత్త మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో రైతుల ప్రత్యక్ష సంభాషణలను, వారికి ఖరీఫ్ పంట కాలం ముందు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి 700 జిల్లాల్లో రెండువేల కంటే ఎక్కువ శాస్త్రీయ బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతిక ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. నువ్వుల్లో మేలురకాలైన యాజమాన్య పద్ధతులపై, సూక్ష్మనీటి ద్వారా సాగులో సాంకేతికత,డ్రోన్ల సాంకేతికత గురించి వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి వ్యవసాయ పరిశోధన స్థానం, ఊటుకూరు వారు ఖరీఫ్ సాగుకు ముందు తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేశ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మండల పశువైద్య అధికారి సుభాష్ చంద్రబోస్ లింగ నిర్ధారక వీర్యపథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజన్న రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ మంగేశ్ దుదే

కూటమి రాకతో ఎద్దలకొండ రోడ్డుకు మోక్షం..!

వేంపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దల కొండ ఆలయం వెలిసింది. పవిత్ర పాపాఘ్ని నది తీరాన వృషభాచలేశ్వరుడు కొలువై పూజలందుకుంటున్నారు. కొండపైకి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని భక్తులు అసౌకర్యానికి గురయ్యేవారు. గత ఐదేళ్ల వైసీపీపాలనలో రోడ్డును పట్టించుకోలేదు. ఈఏపీ కింద కోటి రూపాయలతో తారురోడ్డు మంజూరైనప్పటికీ గత ప్రభుత్వం నిర్మించడంలో నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎద్దల కొండ రోడ్డులో కంకరతేలి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అధికారులతో మాట్లాడి రోడ్డు వేయించేందుకు చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజులుగా ఎద్దల కొండ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మొదట కంకర మిక్సింగ్‌తో రోడ్డు వేసి పైన తారురోడ్డు పనులు చేస్తున్నారు. ఇప్పటికే పాపాఘ్ని నదిలో హైలెవెల్ వంతెన రావడం, ఎద్దల కొండకు తారురోడ్డు రావడంతో కొండపైకి ఆలయానికివెళ్లేందుకు భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.కూటమి రాకతో రోడ్డుకు మోక్షం లభించిందని స్థానిక ప్రజలుసంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నాడు కంకర తేలి అధ్వానంగా ఉన్న వేంపల్లె ఎద్దలకొండ రోడ్డు

కోటి రూపాయలతో చకచకా తారురోడ్డు



నేడు వేంపల్లె ఎద్దలకొండకు వేసిన రోడ్డు

బీఈడీ పరీక్షలు వాయిదా వేయాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డీఎస్సీ 2025 పరీక్షలు జూన్ 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నందున అదే సమయంలో వైఈయూ పరిధిలో జరిగే బీఈడీ పరీక్షలను వాయిదా వేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం వైవీయూలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ కె.ఎస్.వి.కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం ఫ్యాకల్టీ డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, ఎస్‌టీఎఫ్ గౌరవాధ్యక్షుడు కె.నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, నాయకులు మజ్జారి చెన్నకేశవులు పాల్గొన్నారు.

బాలు గానం అజరామరం

కడప మారుతీనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు నేటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో అజరామరంగా ప్రేక్షకుల హృదయాల్లో ఓలలాడుతున్నాయని ఏపీ రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామశేఖర్‌రెడ్డి కొనియాడారు. బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని బుధవారం ఏపీ రెడ్డి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాలులర్పించారు. అనంతరం గానలహరి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు బాలసుబ్రహ్మణ్యం అభిమానులు పాల్గొన్నారు.

వీఎన్‌పల్లెలో ఆధార్ నమోదు కేంద్రం

వీరపునాయునిపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునా యునిపల్లెలో ఎట్టకేలకు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుచేశారు. గతంలో ఇక్కడున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎత్తివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండల బీజేపీ అధ్యక్షులు జి.తులసినాయుడు తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వీరపునాయునిపల్లెలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుచేయాలని కోరగా అధికారులు స్పందించి ఇక్కడున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఉండేందుకు వీరపునా యునిపల్లె సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగింది.

టైరు పగిలి ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

పులివెందుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని పాలూరు గ్రామ సమీపంలో ఆటో టైరు పగిలి ఐదుగురు మహిళలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల్లోకెళితే పులివెందుల సమీపంలో ఉన్న ఆదిత్య బిర్లా ఫ్యాక్టరీలో పనిచేసి ఇంటికి వెళ్లేందుకు మహిళలు ప్రతిరోజూ ఒకే ఆటోను ఏర్పాటు చేసుకున్నారు. అందులో భాగంగానే బుధవారం రాత్రి 7గంటల ప్రాంతంలో పాలూరు-సైదాపురం రహదారిలో ఆటోకు ఉన్న వెనుకటైరు పగిలిపోయింది. దీంతో ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది. ఇందులో సావిత్రి అనే మహిళకు తీవ్ర గాయాలు కాగా మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సావిత్రి పరిస్థితి విషమంగా ఉందని కడపకు తరలించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో వారు ఇంటికి వెళ్లిపోయారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ ఘనమద్దిలేటి తెలిపారు.

బెదిరించారని మహిళ ఫిర్యాదు

పులివెందుల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తనను నానా దుర్భాషలాడి బెదిరించినట్లు మహిళ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందులకు చెందిన సాతుపాటి శ్రీనివాసులు అనే వ్యక్తి మంగళవారం రాత్రి 11గంటలకు వెంకటచలపతి ఇంటికెళ్లారన్నారు. గేటు శబ్దం విని బయటకు వచ్చిన వెంకటచలపతి భార్య తిరుమలేశ్వరిని సాతుపాటి శ్రీనివాసులు దుర్భాషలాడి బెదిరించారన్నారు. ఈ విషయమై తిరుమలేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణ : కేసు నమోదు

పులివెందుల,జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జండామానువీధి పీర్లచావిడి వద్ద పలువురు ఘర్షణ పడిన సంఘటనకు సంబంధించి కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో జండామానువీధిలో పలువురు ఘర్షణ పడుతున్నట్లు పోలీసులకు సమాచారం రాగా అక్కడకు వెళ్లారన్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని, ఈ ఘర్షణకు సంబంధించి కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతన్న

చెన్నూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు సిద్ధమయ్యారు. ప్రతి ఏటా కేసీ కాల్వకు నీరు రావడం కాసింత ఆలస్యమైనా వ్యవ సాయ బోర్లు ఉన్న రైతులు మాత్రం ముందుగానే సేద్యాలు చేసి జీలుగ చల్లి నారుమల్లు సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని బలసింగాయ పల్లె, బయనపల్లె, రామనపల్లె, గుర్రంపాడు, శివాల పల్లె ప్రాంతాల్లో రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. గత ఏడాది ఇదే సమయంలో రైతులు పంటల సాగు చేపట్టడంతో ముందుగానే కోతకు వచ్చిన ధాన్యం ధర ప్రారంభంలో పుట్టి రూ.14వేలు అమ్మడంతో రైతులు కాసింత గట్టెక్కడం జరిగింది. అందుకోసం ఈ ఏడాది కూడా రైతులు ముందుగానే వరిసాగుకు సిద్ధమయ్యారు.

ప్రభుత్వం నుంచి అందని జీలుగలు..: వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ సాగు చేసేందుకు అంగళ్లలో ప్రైవేటుగా జీలుగలు కొని సాగు చేసుకున్నారు. కేసీ ఆయకట్టు రైతులు మాత్రం జీలగలు వేసుకుందామన్నా ప్రభుత్వం నుంచి ఇంకా రాలేదని రైతులు అంటున్నారు.





పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసిన జీలుగ, బోర్ల ద్వారా పొలాలకు వస్తున్న నీరు

బక్రీదును శాంతియుతంగా జరుపుకోవాలి



మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ మోహన్

ఖాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బక్రీదు పండుగను శాంతియుతంగా చేసుకోవాలని సీఐ మోహన్ అన్నారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బక్రీదు పండుగను అందరు కలిసి కట్టుగా చేసుకోవాలని మతాల మధ్య చిచ్చుపెట్టకూడదని, కలిసి మెలసి పండుగను చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలుటౌన్‌లో : బక్రీదు పండును సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బక్రీదు పండుగ సందర్భంగా లేగదూడలను, గోవధ చేయరాదని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగింపు

పోరుమామిళ్ల జూన్ 4 (ఆంధ్రజ్యోతి) :రోడ్డు విస్తరణలో భాగంగా పోరుమామిళ్లలోని సాయిబాబా దేవాలయం వద్ద రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కొందరు ముందుగానే తమ షాపుల ముందు ఉన్న రేకులను స్వచ్ఛందంగా తొలగించారు. నిర్మాణం చేపట్టే వారు ఒకేసారి 80 అడుగుల విస్తీర్ణం తీసుకుని కాల్వ లెవలింగ్ చూసుకుని నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కరించిన వారవుతారని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈవో రవిశంకర్

చాపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చాపాడు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణ, బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ కమల్‌నాథ్‌శర్మ, లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డి, డీడీసీ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంట ఏజన్సీలకు శిక్షణ

ముద్దనూరు జూన్4(ఆంధ్రజ్యోతి):స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంట ఏజన్సీలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఎంఈవో నాగేశ్వరనాయక్ మాట్లాడుతూ ఈనెల 12 వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు.అనంతరం వంటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆర్‌పీ శారదాదేవి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై ఇంటింటి ప్రచారం.

ఎర్రగుంట్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని కమలాపురం క్లష్టర్ అధికారి సునీల్ పేర్కొన్నారు. బుధవారం ఎర్రగుంట్లలో క్షయవ్యాధి నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. 60ఏళ్ల పైబడి ఉన్నవారికి ఆరోగ్యసిబ్బంది ఇళ్లవద్దకే వచ్చి పరీక్షలు అలాగే ఎక్స్‌రేలు తీస్తారన్నారు.

ప్రకృతి వ్యవసాయం



డ్రమ్ములో జీవామృతం తయారుచేస్తున్న మహిళా రైతు లక్ష్మీదేవి (ఫైల్‌ఫొటో)



జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు చూపుతున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

చాపాడు, జూన్4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యవంతమైన పంటలను ఉత్పత్తి చేయవచ్చు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా పంటలకు వాడుతుండడంతో భూసారం దెబ్బతినడమే కాకుండా విషరసాయనాలను ఉపయోగిస్తున్నందున ఆహార ఉత్పత్తులు విషంగా తయారు అవుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలాంటి వాటి బారీన పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. గత అయిదేళ్లుగా ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు దృష్టి పెట్టారు. రైతులు ఉద్యానవన పంటలు జామ, చీనీ వంటి పంటలను ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నారు. ఈ ప్రకృతి వ్యవసాయం కింద జీవామృతం తయారు చేసుకోవాలని అధికారులు వారికి సలహాలు ఇస్తున్నారు. ఈ జీవామృతానికి ఆవుపేడ, ఆవుపంచికం, శనగ పిండి, బెల్లం, పుట్టమట్టి, నీళ్ల వంటివి అవసరం. వీటిని ఒక డ్రమ్ములో కలిపి జీవామృతం తయారు చేస్తారు. వంద లీటర్ల నీటిలో రెండు కేజీల బెల్లం, రెండు కేజీల శనగపిండి, పది కేజీల ఆవుపేడ, పది లీటర్ల ఆవుపంచికం, గుప్పెడు పుట్టమట్టితో తయారు చేస్తారు. వీటన్నింటిని డ్రమ్ములో కలిపి వారం రోజులపాటు కలియబెట్టుతూ రావడంతో జీవామృతం తయారవుతుంది. ఇలా తయారు చేసిన జీవామృతాన్ని వరి, వేరుశనగ, పసుపు, నిమ్మ, సపోట, జామ వంటి పంటలకు స్ప్రే చేయాలి. అప్పుడు మొక్కల ఆకులు, కాండం, ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. పూత దశలో పిచికారి చేస్తే పండ్ల దిగుబడి, నాణ్యత, రుచి బాగుంటుందని రైతులు తెలిపారు. ఈ జీవామృతం తయారు చేసేందుకు రూ.1500 మాత్రమే ఖర్చు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. జీవామృతం వాడితే పంటలకు ఆశించే తెల్లదోమ, చీడ పురుగు నివారణ అవుతాయి. మొక్కల వేర్లకు సూక్ష్మపోషకాలు అందుతాయి. మండలంలోని వెదురూరు, రాజుపాళెం, చాపాడు, రాజువారిపేట, పల్లవోలు, సీతారామపురం, మరికొన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం కింద జీవామృతాన్ని తయారు చేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఈ జీవామృతంతో భూమి సారవంతం అవుతుంది. రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది. సులభంగా పంటలు పండివచ్చు.

రైతులకు ఖర్చు తగ్గుతుంది

జీవామృతంను పంటల సాగుకు ఉపయోగిస్తే రైతులకు ఖర్చు తగ్గుతుంది. మొక్కలు, పలాలు ఆరోగ్యవంతంగా ఉంటాయి. భూమి సారవంతం అవుతుంది. భూమిలో వానపాముల సంఖ్య భారీగా పెరుగుతాయి. ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించవచ్చు.

- మొగిలి ఆంజనేయులు,
మండల ప్రకృతి వ్యవసాయ సలహాదారు

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు , జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కలిశారు. బుధవారం రాజధాని అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో చంద్రబాబును కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జరగవలసిన అభివృద్ధిపనులపై ముఖ్యంగా రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయడంపై సీఎంతో చర్చించారు. ప్రొద్దుటూరు అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వరదరాజులరెడ్డి తెలిపారు. సీఎం ను కలిసిన వారిలో రాజుపాళెం మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

ప్రజా పంపిణీని పరిశీలించిన ఆర్డీవో

దువ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో చౌక దుకాణాల ద్వారా ప్రజా పంపిణీని బుధవారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పరిశీలించారు. స్థానికంగా ఉన్న 32, 34 చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ జరిగే విధానాన్ని తహసీల్దారు అక్బల్‌బాషాతో కలిసి ఆరా తీశారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందించాలని డీలర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం డీలర్లు నడుచుకోవాలని తెలిపారు. తూకాల విషయంలో కచ్చింగా వ్యవహరించాలని డీలర్లకు తెలిపారు.

రాజుపాలెంలో: తెల్లరేషన్ కార్డుదారులకు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిశ్రీ చౌక దుకాణం డీలర్లకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొరపాడు గ్రామంలో 60సంవత్సరాలు నిండిన వారి ఇంటి వద్దకు వెళ్లి రేషను పంపిణీ విషయంపై అక్కడున్న వద్ధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ హుసేన్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడులో: మండల కేంద్రమైన చాపాడులోని వికలాంగులైన చిట్టిబోయిన మహాలక్షుమ్మకు జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ బుధవారం 35 కేజీల బియ్యాన్ని పంపిణీ చేశారు. మహాలక్షుమ్మకు ఉన్న అంత్యోదయ కార్డును, ఆధార్‌కార్డును ఆర్డీవో పరిశీలించారు. తనకు పింఛన్ రాలేదని మహాలక్షుమ్మ ఆర్డీవోకు తెలిపారు. పింఛన్ వచ్చేలా చూడాలని ఆర్డీవో తహసీల్దారునుఆదేశించారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయం పై హర్షం

ప్రొద్దుటూరు , జూన్ 4 (ఆంధ్ర జ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ హోదాను రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకే షన్ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని రాష్ట్ర అసోషియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ వెల్లడించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్ నెంబరు 64 ను జారీ చేసిందని ఆయన వెల్లడించారు. అసోషియేషన్ ఉపాధ్యక్షులు సాధు వెంకటేశ్వర్లు, మహమ్మద్ రఫీ, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి బలరామరాజులు హర్షం ప్రకటించారు.

విద్యుత్తు సమస్యలను పరిష్కరిస్తాం

ఖాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని ఏడీ శ్రీకాంత్ అన్నారు. బుధవారం పుల్లూరు పంచాయతీలో టీడీపీ నాయకులు, అధికారులు గ్రామాలను పరిశీలించారు. టీడీపీ నాయకుడు ఫరూక్, ప్రతాప్‌రెడ్డి, రవి, సుబ్బయ్య, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

ఏపీలో అరాచకానికి విముక్తి కలిగి ఏడాది పూర్తి



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

ప్రొద్దుటూరు , జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏపీలో అరాచకపాలనకు విముక్తి కలిగి ఏడాది పూర్తిచేసుకుని కూటమి ప్రభుత్వపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ జబివుల్లా పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి 2024 జూన్ 4 వరకు వైసీపీ అవినీతి అరాచక పాలన సాగిందన్నారు. సభలు పెడితే రాళ్ళ దాడి చేయించారన్నారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అరాచక కార్యక్రమాలను ప్రోత్సహించి అక్రమంగా వందల కోట్లు సంపాదించాడని ఆరోపించారు. అంతకు ముందు కూటమి పాలన ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, తలారి రమేష్ దుగ్గిరెడ్డి రఘునాధరెడ్డి, యోగివేమన యూనివర్శిటి నాన్‌టీచింగ్ స్టాప్ అధ్యక్షుడు రసూల్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును అవమానిస్తారా..?



కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర డైరెక్టరు వెంకటసుబ్బయ్య

బి.కోడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓట్లు వేసి టీడీపీని గెలిపిస్తే ప్రజా తీర్పును వెన్నుపోటు దినమంటూ వైసీపీ నాయకులు ప్రజలను అవమానించడం దుర్మార్గపు చర్య అని రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టరు పరిటాల వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం కూటమి ప్రభుత్వం వచ్చి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాతీర్పును ప్రజలను వైసీపీ నేతలు అవమానిస్తున్నారని ఆయన ఎద్దేవాచేశారు. చంద్రబాబునాయుడు దార్శనికత పరిపాలనలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీజిల్లా అధ్యక్షుడు మునిరెడ్డి మరియు నాయకులు కార్యక్రతలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

జమ్మలమడుగు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున అన్నారు. బుధవారం జమ్మలమడుగులోని జనసేన కార్యాలయం వద్ద బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సంబరాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం పింఛన్ పెంచడం ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధి గత ప్రభుత్వంలో కుంటుపడిందన్నారు. జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారన్నారు. రోడ్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తల్లి ఉత్సవాలు



నాయకురాలు నాగమ్మ వేషధారణలో గుట్టపాపలను నరికేందుకు వస్తున్న భక్తుడు

బి.కోడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో వెలసిన పల్నాడు అంకాలమ్మ తల్లి ఉత్సవాలు గత శుక్రవారం నుంచి వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం నాయకురాలు నాగమ్మ వేషధారణలు రాజుపాలెం గ్రామం చుట్టూ పొలిమేరలు తొక్కుట, అనంతరం గుట్టపాపలను నరుకుట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు విరివిగా పాల్గొని తల్లి దీవెనలు అందుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాత్రికి పాటకచ్చేరి నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కల్లూరు క్రిష్టారెడ్డి, కొండా క్రిష్టారెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న వీఎస్ ముక్తియర్

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను ప్రొద్దుటూరు అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్ బుధవారం సన్మానించారు. బక్రీద్ పండుగా పురస్కరించుకొని కొర్రపాడు రోడ్డు పాలిటెక్నిక్ కాలేజ్ వద్దగల ఈద్గా పరిసరాలను శుభ్రపరిచిన పారిశుధ్య కార్మికులను ఆయన ఈద్గా ప్రాంగణంలోనే దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనునిత్యం ప్రజల ఆరోగ్యం కోరుతూ ఎప్పటికప్పుడు డ్రైనేజీలు, రోడ్లు శుభ్రపరుస్తూ ఎంతో కష్టపడుతున్న పారిశుధ్య కార్మికుల శ్రమకు గుర్తింపుగా ఈ చిరు సన్మానమని అన్నారు. కార్యక్రమంలో అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ వైస్ ప్రెసిడెంట్ బొల్లవరం బాష, సెక్రెటరీ ఇలియాస్, మీరా హుస్సేన్, బాషు, ఖలీల్, షబ్బీర్, మస్తాన్, మైను తదితరులు పాల్గొన్నారు.

గండికోట నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

● సీపీఐ మహాసభల్లో జిల్లా కార్యదర్శి గాలి చంద్ర



సీపీఐ ఆరవ మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

కొండాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితులకు పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండాపురంలో బుధవారం సీపీఐ నిర్వహించిన నియోజకవర్గ ఆరవ మహా సభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా కడప ఉక్కు ఫ్యాక్టరీని చిత్తశుద్ధితో వెంటనే పూర్తిచేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. గాలేరు-నగరి, హంద్రీ-నీవాతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి కరువు బారిన పడిన రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యు లరైజ్ చేసి అసంఘటిత కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇంటిస్థలం, రెండెకరాల భూమి ఇవ్వాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కడప- బెంగుళూరు రైల్వేలైను నిర్మాణం పనులు పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గంలోని సీపీఐ దానికి అనుబంధ సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండాపురంలో సీపీఐ నాయకలులు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ, కార్మిక సంఘాల నాయకులు రామయ్య, సుబ్రమణ్యం, ఎంవీసుబ్బారెడ్డి, చాంద్‌భాషా, మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపుల మట్టికుప్పలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మూడిండ్లపల్లె తారు రోడ్డులో జరుగుతున్న పెండింగ్ పనులు

దువ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం మూడిండ్లపల్లె తారురోడ్డుకు ఇరువైపుల ఉన్న మట్టి కుప్పల తొలగింపు పనులు ఎట్టకేలకు బుధవారం మొదలు పెట్టారు. ఈ ప్రాంతంలో తారు రోడ్డు నిర్మించి వంద రోజులకుపైగా అయింది. అయితే రోడ్డు వేసి ఇరువైపుల సత్తుతో కూడిన మట్టి కుప్పలను అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో 'రోడ్డు సరే మట్టికుప్పలేంటి' అనే శీర్షికతో ఈనెల 1వ తేదీ కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు పూనుకున్నారు. మట్టికుప్పలను తొలగించి రోడ్డుకు ఇరువైపుల గ్రావెల్ తోలుతున్నారు. సదరు గ్రావెల్‌ను డోజర్‌తో నడుపుతూ పనులను చదును చేస్తున్నారు. పెండింగ్ పనులు చేపడుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జమ్మలమడుగులో వెన్నుపోటు దినం ర్యాలీ



జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జమ్మలమడుగు/ప్రొద్దుటూరు/ మైదుకూరు/ బద్వేలు/ఎర్రగుంట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. అధిష్టానం పిలుపుమేరకు జమ్మలమడుగులో ఎమ్మెల్సీతో పాటు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం చేరుకుని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణాధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరి గజ్జెల లక్షుమయ్య, మైలవరం, పెద్దముడియం, తదితర మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ఎర్రగుంట్లలో జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జడ్పీటీసీ బాలయ్య, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, జయరాంరెడ్డి, పాల్గొన్నారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పేర నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు బంగారు రెడ్డి ఖాజా, ఎంపీపీ శేకర్ యాదవ్ మున్సిపల్ కౌన్సిల్లర్లు పాల్గొన్నారు. కాగా మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరులో ర్యాలీ నిర్వహించి ఎండీఓ రమణారెడ్డికి వినతి పత్రం అందచేశారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.బద్వేలులో ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఆది పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ లక్ష్మీకాంతమ్మ

ముద్దనూరు జూన్4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం మండల బీజేపీ నాయకులు డాక్టర్ మధుసూదనరెడ్డి ఆయన సోదరి ఎంపీటీసీ లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.కోడిగాండ్లపల్లె సమీపంలోని ఏసు కరుణాలయంలోని మానసిక వికలాంగులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి పుట్టిన రోజు శుకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేంద్రనాథరెడ్డి, వార్డు మెంబర్ సాగర్‌బాబు, మధునాయుడు, గఫూర్, సుబ్బరాయుడు.నాగిరెడ్డి, పుట్ట తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులకు మార్గదర్శి గోపాల్‌రెడ్డి



గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బద్వేలు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):భావితరాల ఉపాధ్యాయులకు మార్గదర్శి పాలకొండు గోపాల్‌రెడ్డి అని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బుచ్చిరెడ్డి కళ్యాణమండపంలో గోపాల్‌రెడ్డి పదవీ విరమణ సన్మానసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిపట్ల అంకితభావం గోపాల్‌రెడ్డి సొంతమన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోపవరం మండల విద్యాశాఖాధికారులు చెన్నయ్య, రఘురామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయలు రవిశంకర్, నరసింహారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అట్లూరు మండల ఎంపీడీవో భాస్కర్‌బాబు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కన్వీనరు తిరుపాల్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్, అట్లూరు ఎంఈవో విలియంరాజు, ఖాదర్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఎయిడ్స్‌వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న కళాజాత

పోరుమామిళ్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) :హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నివారణపై ప్రజలకు జయశంకర్ కళాజాత బృందం అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఆధునిక కళాజాత పెళ్లినాటకం ద్వారా ఎయిడ్స్ నివారణపై కళాజాత ప్రదర్శించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఐసీటీసీ సెంటర్ల ద్వారా అవగాహన కల్పిస్తూ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు కూడా అందించడం జరుగుతుందన్నారు. కళాజాత బృందం పాటల ద్వారా నాటికల ద్వారా ప్రయాణికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్, చల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్ ఖాదర్ బాషా, కళాజాత బృందం జయశంకర్, సుధాకర్, రాఘవేంద్రబాబు, జయరామయ్య పాల్గొన్నారు.